నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, ఆదివారం 21 జూలై 2024 YADADRI BHUVANAGIRI




హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య కుటుంబానికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

## యాదగిరీశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య

యాదగిరిగుట్ట, జూలై 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషిమి భట్టాచార్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం యాదగిరిగుట్టకు చేరుకున్న న్యాయమూర్తికి అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి నేరుగా గర్భాలయంలో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

## భిక్షమయ్యగౌడ్‌కు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు

యాదగిరిగుట్ట, జూలై 20 : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం తన జన్మదినం పురస్కరించుకుని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షమయ్యగౌడ్‌ను మాజీ ముఖ్యమంత్రి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు





సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు

భువనగిరి కలెక్టరేట్ జూలై 20 : ర్యాగింగ్ నిరోధ చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ప్రధాన సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు సూచనల మేరకు శనివారం పట్టణ పరిధిలోని రాయగిరిలోని యూనిటీ ఫార్మసీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధ చట్టాలు, ర్యాగింగ్‌ను అరికట్టేందుకు కళాశాల యాజమాన్యం తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని, తాము ర్యాగింగ్‌కు పాల్పడబోమని ప్రతి విద్యార్థి అఫిడవిట్ సమర్పించాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిషేధంపై పూర్తి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. భువనగిరి ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని, చట్టాలపై అవగాహన పెంచుకొని అందుకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్ నిరోధానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి. హరినాథ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమములో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్. జైపాల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి. శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఉద్యోగుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగులు

ఆత్మకూరు(ఎం), జూలై 20 : గ్రామ పంచాయతీ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో కార్మికులు, ఉద్యోగులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామపంచాయతీ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ యాదమ్మ, మండలాధ్యక్షుడు కూరెళ్ల కిష్టయ్య, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# పట్టాదారుడికి కాదు... కుటుంబానికే రుణమాఫీ

### రేషన్‌కార్డే ప్రామాణికం అంటున్న అధికారులు

### సీఎం చెప్పినట్టు ప్రతి పట్టాదారుడికి రుణమాఫీ లేనట్లే

- ఆ ప్రకారమే లక్ష లోపు రుణమాఫీ జాబితా
- అందుకే 40శాతం మించని లబ్ధిదారుల సంఖ్య
- ఎంత వీలైతే అంత కుదించేందుకు సర్కారు కుట్రలు
- తీవ్ర ఆందోళనలో రైతాంగం
- కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై రైతుల మండిపాటు



నల్లగొండలోని యూనియన్ బ్యాంక్‌లో తమ ఖాతాలను చెక్ చేసుకుంటున్న రైతులు

**రైతాంగంపై కాంగ్రెస్ సర్కారు కపట ప్రేమకు సాక్ష్యంగా రెండు లక్షల రుణమాఫీ పథకం నిలుస్తున్నది. రుణం తీసుకున్న ప్రతి రైతుకూ 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మొండిచెయ్యి చూపుతుండడం చర్చనీయాంశంగా మారింది. అప్పుడు అందరికీ అని చెప్పి... ఇప్పుడు చడీచప్పుడూ లేకుండా కొర్రీలు పెడుతున్నది. సాధ్యమైనంత మేరకు లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి ఆర్థిక భారం తగ్గించుకునేందుకు కుట్రలు చేస్తున్నది. అందుకే పట్టాదారు పాస్‌పుస్తకం ప్రాతిపదికను అటకెక్కించింది. కేవలం రేషన్‌కార్డు ఆధారంగా ఒక కుటుంబానికి గరిష్టంగా 2 లక్షల రూపాయల రుణమాఫీ వర్తింపజేయాలంటూ ఆదేశాలిచ్చింది. ఇదే విషయం శనివారం నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్‌కుమార్ కూడా స్పష్టం చేయడం గమనార్హం. దాంతో మూడింట రెండొంతుల మందికి రుణమాఫీ రాదన్న చర్చ సర్వత్రా సాగుతున్నది.**

– నల్లగొండ ప్రతినిధి, జూలై 20 (నమస్తే తెలంగాణ)

రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి చెప్తున్న మాటలకు, క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్న తీరుకు పొంతన లేకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగానే రుణమాఫీ అమలు చేస్తామని పైకి ప్రకటించి క్షేత్రస్థాయిలో మాత్రం రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబానికి 2లక్షల రుణమాఫీ అని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అందుకే పెద్ద సంఖ్యలో రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యలో కోత పడింది. క్షేత్రస్థాయిలో బ్యాంకర్లు, సహకార సొసైటీల అధికారులు కూడా రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ జరిగిందని చెప్తున్నారు. ఫలితంగా రుణమాఫీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులపై కాంగ్రెస్ సర్కార్ నీళ్లు చల్లినట్లైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది వరకు లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు ఉంటారని అంచనా. ఇందులో 1.76లక్షల మందికే రూ.941 కోట్లను రుణమాఫీ వర్తింపచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కేసీఆర్ సర్కార్ 99,999 రూపాయల వరకే 4లక్షల పైచిలుకు రైతులకు రూ.2150 కోట్ల వరకు రుణాలను మాఫీ చేసింది. ఆ లెక్కన చూస్తే రుణమాఫీలో పెద్దఎత్తున కోతలు పెట్టినట్లు స్పష్టమవుతుంది. ఒక్క సూర్యాపేట జిల్లాను పరిశీలిస్తే.. ఇక్కడ రూ.2లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులు 2.53లక్షల మంది ఉన్నట్లు గతంలో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వారందరికీ రుణమాఫీ వర్తింపజేస్తే రూ.3,350 కోట్ల వరకు వెచ్చించాలి. ఇందులోనే లక్ష లోపు రుణాలను పరిశీలిస్తే సుమారు 1.75లక్షల మందికి రూ.1,300 కోట్ల వరకు రుణాలు మాఫీ కావాల్సి ఉంది. కానీ గురువారం ప్రకటించిన జాబితా ప్రకారం కేవలం 56,274 మందికి రూ.282.98కోట్ల రుణాలే మాఫీ అవడం గమనించాల్సిన విషయం. వాస్తవ అంచనాలో 25శాతం వరకు కూడా రుణమాఫీ జరగడం లేదని స్పష్టమవుతున్నది. ఇదే విషయంపై అధికారిక సమాచారం కోసం ఎవరిని సంప్రదించినా ఎవ్వరూ నోరు మెదపని పరిస్థితి నెలకొంది.

### రేషన్ కార్డు లేకుంటే అంతేనా!

రెండ్రోజులుగా రుణమాఫీ వర్తించని రైతులంతా బ్యాంకులకు, సొసైటీలకు బారులు తీరుతున్నారు. ఇక్కడ అధికారులు వాస్తవాలు చెప్పక తప్పడం లేదు. తమకు అసలు, వడ్డీ కలిపి లక్ష రూపాయల లోపే ఉన్నా ఎందుకు మాఫీ కాలేదంటే మీ కుటుంబంలో మరొకరికి కూడా అప్పు ఉంది కాబట్టి ఇద్దరికీ కలిపి లక్ష దాటితే రుణమాఫీ ఇప్పుడు ఉండదని కుండబద్దలు కొడుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలను పరిశీలిస్తే రేషన్ కార్డు ఆధారంగానే మాఫీ చేస్తున్నారని సొసైటీ అధికారులు చెప్తున్నారు. ఇదేవిధంగా ఒక కుటుంబంలో ఎంతమంది రుణాలను తీసుకున్నా అందరికీ కలిపి గరిష్టంగా రెండు లక్షల రుపాయల వరకు మాఫీ జరుగుతుందని కూడా స్పష్టం చేస్తున్నారు. ఇక రేషన్‌కార్డులో పేర్లు లేని రైతులకు రుణమాఫీని పక్కన పెట్టేశారు. ఇలాంటి వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. వీటన్నింటి వల్ల రుణమాఫీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు ఇప్పుడు బాధపడుతున్నారు. రుణం తీసుకున్న ప్రతి రైతుకూ రెండు లక్షల వరకు రుణమాఫీ అని ఎన్నికలప్పుడు చెప్పి... ఇప్పుడు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సీజన్లలోనూ కాలం కాక పంటలు సరిగ్గా పండక ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులకు కాంగ్రెస్ సర్కార్ తీరు మరింత ఆందోళనకరంగా మారింది.

### లోన్ లక్షలోపే ఉన్నా మాఫీ కాలేదు



మాది తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామం. నేను రూ.65 వేలు, నా కొడుకు రాకేశ్ రూ.60 వేలు వేర్వేరు పట్టాదారు పాస్ పుస్తకాలతో నాగార్జున గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్నాం. ప్రభుత్వం లక్షలోపు రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేసింది. కానీ.. మా పేర్లు మాత్రం ఆ లిస్టులో లేవు. రేషన్ కార్డులు వేరుగా లేనందున మాఫీ కాలేదా.. అనుకుంటే మా ఊరిలో ఒకే రేషన్ కార్డులో పేరు ఉన్న ఇద్దరికీ రుణమాఫీ అయ్యింది. మాకు కూడా రుణమాఫీ జరుగుతుందని ఎంతో ఆశపడ్డాం. కానీ.. మాకు మాత్రం మాఫీ కాలేదు.

**- యామగాని శారద, తాటిపాముల, తిరుమలగిరి మండలం, సూర్యాపేట జిల్లా**

# న్యూట్రిషన్ కిట్లు బంద్..

### జిల్లాలో మూడు నెలలుగా పంపిణీ లేదు

- రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిలిచిన సరఫరా
- గతంలో రెండు సార్లు రూ.1,962 విలువైన కిట్
- బాక్స్‌లో ఐరన్ సిరప్, న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, ఖర్జూర
- కనీసం పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు





యాదాద్రి భువనగిరి, జూలై 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల సంక్షేమంపై శ్రద్ధ పెట్టడం లేదు. గర్భిణులకు అందించే పథకాలపై నిర్లక్ష్యం వహిస్తున్నది. తాజాగా న్యూటిషన్ కిట్ల పంపిణీ బంద్ పెట్టింది. జిల్లాలో మూడు నెలలుగా కిట్ల పంపిణీ నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరఫరా కాకపోవడంతో కిట్లు అందడం లేదు. ఫలితంగా గర్భిణులతోపాటు పుట్టబోయే బిడ్డలకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది.

మాతాశిశు సంరక్షణకు కేసీఆర్ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసింది. అందులో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు న్యూట్రిషన్ కిట్ పథకాన్ని తీసుకొచ్చింది. తద్వారా గర్భిణుల్లో రక్తహీనతను నివారించి, మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ఉపక్రమించింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక న్యూట్రిషన్ కిట్‌పై ఫోకస్ పెట్టడం లేదు. జిల్లాలోని ఏ ఆస్పత్రిలో కూడా కిట్లు లేవు. మూడు నెలలుగా కిట్ల పంపిణీ బంద్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు సరఫరా నిలిచిపోవడంతో పథకం ఆగిపోయింది. జిల్లాలో 2024-25 సంవత్సరానికి గానూ 2,124 గర్భిణులు మొదటి విడత టీటీ డోసు, 2,116 మంది రెండో విడత టీటీ డోసు వేయించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1,532 ప్రసవాలు జరిగాయి.

### రూ. 1,962 విలువైన కిట్..

గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ సమర్థంగా, విజయవంతంగా అమలు చేయడంతో న్యూట్రిషన్ కిట్ తీసుకొచ్చింది. కిట్‌తో బలవర్ధకమైన పోషకాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంది. కిట్ విలువ 1962 రూపాయలు. ఇందులో మూడు బాటిళ్ల ఐరన్ సిరప్, ఒక కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, 500 గ్రాముల నెయ్యి, కిలో ఖర్జూర పండ్లు, ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు, ఒక ప్లాస్టిక్ బాస్కెట్, ఒక కప్పు ఇచ్చేవారు. కిట్‌ను ఒక్కొక్కరికి రెండు సార్లు అందించేవారు. మొదటి కిట్‌ను 13-27 వారాల మధ్య జరిగే రెండో ఏఎన్‌సీ సమయంలో, రెండో కిట్‌ను 28-34 వారాల మధ్య చేసే మూడో ఏఎన్‌సీ చెకప్ సమయంలో ఇచ్చేవారు.

### రక్తహీనత నివారణకు ఉపయుక్తం..

రక్తహీనత గర్భిణుల పాలిట శాపంగా మారుతుంది. దీని కారణంగా ప్రసవ సమయంలో తల్లీబిడ్డలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రసవం సంక్లిష్టంగా మారుతుంది. రక్తహీనతను నివారించడం వల్ల మాతాశిశు మరణాలు తగ్గే అవకాశం ఉంటుంది. ప్రొటీన్లు, మినరల్స్, విటమిన్లు అధికంగా ఉండే పోషకాహారం ద్వారా రక్తహీనతను తగ్గించడం, హిమోగ్లోబిన్ శాతం పెంచడం న్యూట్రీషన్ కిట్ ప్రధాన లక్ష్యం. కానీ కాంగ్రెస్ సర్కారు కనీసం పట్టించుకోపోవడంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హనుమంత్ కె.జెండగే



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంత్ కె. జెండగే

బీబీనగర్, జూలై 20 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గర్భిణులకు అందించే సేవల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె.జెండగే వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్ పట్ల చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో డ్రగ్ స్టోర్‌ను, మందుల వివరాలను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు చికిత్స అందించేందుకు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పనులు వెంటనే పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాపారావు, పీహెచ్‌సీ డాక్టర్లు మౌనిక, వసంత ఉన్నారు.



యాదాద్రి ఆలయంపై కురుస్తున్న వర్షం

# రోజంతా ముసురు

### అత్యధికంగా ఆత్మకూరు(ఎం)లో 15.8 మిల్లిమీటర్ల వాన



వర్షంలో వాహనంపై వెళ్తున్న యువకులు

యాదాద్రి భువనగిరి (నమస్తే తెలంగాణ)/ భువనగిరి కలెక్టరేట్, జూలై 20 : జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ముసురుకుంది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వాన కురిసింది. దీంతో బయటకు వచ్చేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. శనివారం జిల్లాలో సగటున 9.5 మిల్లిమీటర్ల. వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు(ఎం)లో అత్యధికంగా 15.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మోత్కూరు, వలిగొండ మండలాల్లో 10.5 మి.మీ., భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్ మండలాల్లో 10.3, యాదగిరిగుట్టలో 9.5, రామన్నపేటలో 8.8, భువనగిరిలో 7.3, మోటకొండూరులో 5.8, అడ్డగూడూరు, తుర్కపల్లి(ఎం), సంస్థాన్ నారాయణపురంలో 3.8, బొమ్మలరామారంలో 3.3, గుండాలలో 3, ఆలేరులో 1.5 మి.మీ. వాన పడింది.

## మూసీ ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి

- ఏఐకేఎస్ జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

భువనగిరి అర్బన్, జూలై 20 : మూసీని కాలుష్య రహితంగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సంఘం జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మూసీ ప్రక్షాళన, కృష్ణా, గోదావరి జలాల సాధనపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ కాలుష్యం వల్ల భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంటలు కలుషితమవుతున్నాయన్నారు. మూసీ నీటితో పండిన పంటలను తినడం వల్ల క్యాన్సర్, చర్మ వ్యాధులు, మహిళలకు గర్భకోశ వ్యాధులతో పాటు అంతుచిక్కని వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా మూసీ కాలుష్య నివారణకు ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయిస్తున్నా, పని మాత్రం జరుగడం లేదన్నారు. కొండమడుగు నర్సింహ, మేక అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, నాయకులు బట్టుపల్లి అనూరాధ, మాటూరు బాలరాజు, కల్లూరు మల్లేశం, పాండు, రామచంద్రయ్య పాల్గొన్నారు.